
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు

5★★★

బుధవారం 13 మార్చి 2024

కృత్రిమ కరువు సృష్టించాలని చూస్తున్న కేటీఆర్, హరీష్

8

పార్లమెంట్ ఎన్నికలను కట్టుదిట్టంగా నిర్వహించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



ఇఫ్తార్ | 6:24
బుధవారం
సహర్ | 4:56
గురువారం



ఆగిన మగ్గం.. నేతన్నల పస్తులు

- పవర్‌లూం నేత కార్మికుడి బలవన్మరణం
- నిలిచిన ప్రభుత్వ ఉత్పత్తి ఆర్డర్లు
- మూతపడిన 20 వేల మరమగ్గాలు
- రెండు నెలలుగా ఆగమాగం
- ఉపాధి కోసం ధర్నాలు, రాస్తారోకోలు
- 14న సీఐటీయూ 24 గంటల నిరాహారదీక్ష
- 15న బీఆర్ఎస్ మహాధర్నా

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభంతో నేతన్నలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు లేక పస్తు లుంటున్నారు. ఉపాధి కల్పించాలని పాలకులను, అధికారులను వేడుకుంటున్నారు. పట్టించుకోవడం లేదని ఆందోళనల బాట పడుతున్నారు. మరోవైపు పవర్‌లూం కార్మికుడి ఆత్మహత్య కార్మిక కుటుంబాలను ఆందోళనకు గురి చేసింది. మాయమై పోయిందనుకున్న మృత్యుఘోష మళ్లీ మొదలైందా? అని కార్మిక కుటుంబాలు ఆవే దన చెందుతున్నాయి. నిత్యం అనేక ఆటుపోట్లు, మరమగ్గాల చప్పుళ్ల మధ్య పోగూపోగు పేనుతూ ఉపాధి వెతుక్కునే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మళ్లీ సంక్షోభంలో నెట్టివేసి నట్లయ్యింది. దాదాపు ఏడేళ్ల క్రితం వరకు కాలంతో పోటీపడలేక బహిరంగ మార్కెట్‌లో ఉత్పత్తి చేసిన వస్త్రాలను అమ్ముకోలేక ఆత్మహత్యలు అకలి చావులకు గురైన సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమ మరణశయ్యపై చేరుకుంది. వందల సంఖ్యలో కార్మికులు చనిపోతూ సిరిసిల్ల ఉరిసిల్లగా మారిన పరిస్థితులు. అయితే గత ప్రభుత్వం బతుకమ్మ చీరలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లతో చేతి నిండా పని కల్పించింది. దీంతో పరిశ్రమ కొంత మేరకు నిలదొక్కుకుంది. ప్రస్తుతం ప్రభుత్వ బట్ట ఆర్డర్లు నిలిచిపోవడం, బహిరంగ మార్కెట్‌లో ఆర్డర్లు దొరకకపోవడం వంటివాటికి తోడుగా ప్రభుత్వం నుంచి రూ.250 కోట్ల వరకు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు బకాయిలు రావాల్సి ఉంది. దీంతో కొత్తగా పెట్టుబడులు పెట్టలేని యాజమాన్యాలు ఉత్పత్తులను నిలిపివేశాయి, రాష్ట్రంలోనే అత్యధికంగా సిరిసిల్లలో దాదాపు 26 నుంచి 30 వేల మరమగ్గాలు ఉన్నాయి. వీటిలో 20 వేల మరమగ్గాల వరకు మూత పడ్డాయి. మరమగ్గాలపై ఉత్పత్తులు నిలిచిపోవడంతో కార్మికులు ఉపాధి కోల్పోయి వీధిన పడ్డారు.

మళ్లీ పాత పరిస్థితులేనా?

మరమగ్గాల బతుకులు మళ్లీ చితికి పోతున్నాయా? రాత్రి పగలు కష్టపడిన మగ్గం బతుకులు మళ్లీ రోడ్డునపడతాయా? సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమ మూతపడడంతో సోమవారం రాత్రి సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెం దిన పవర్‌లూం నేత కార్మికుడు తడక శ్రీనివాస్ (42) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నేత కార్మికుడు శ్రీనివాస్ ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు ఎర్కో వడం, అనారోగ్యం తోడు కావడంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు అనూష డిగ్రీ మొదటి సంవత్సరం, చిన్న కూతురు అక్షయ మోడల్ స్కూల్‌లో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. భార్య లావణ్య బీడీలు చుడుతూ ఉపాధి పొందుతోంది. శ్రీనివాస్ కొద్ది రోజులుగా సరైన ఉపాధి దొరకక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఫిట్స్‌తో బాధపడుతున్న శ్రీనివాస్ కనీసం మందులు కొనుగోలు చేసుకునే పరిస్థితి కూడా లేదని తోటి కార్మికులు తెలిపారు. గతంలో సంక్షోభ సమయంలో నేత కార్మికులు వందల సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడ్డ విషాద సంఘటనలు ఉన్నాయి. గతంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడిన 15 వేల మంది కార్మికులు పాలిస్టర్ బట్ట ఉత్పత్తి ద్వారా రూ .8 నుంచి రూ.10 వేలు ప్రభుత్వ ఆర్డర్లు, బతుకమ్మ చీరల ఆర్డర్ల ద్వారా రూ.15 నుంచి రూ.18 వేలవరకు ఉపాధి పొందారు. ప్రస్తుతం ఆ ఉపాధి దూరమైంది. సిరిసిల్లలో 30 వేల మరమగ్గాల్లో 25 వేల మరమగ్గాలపై ఉత్పత్తులు నిలిచిపోవడంతో కార్మికులు వీధిన పడ్డారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ ఎక్కడ మృత్యుఘోష వినాల్సి వస్తుందోననే ఆందోళనలు నెలకొన్నాయి.

ఉపాధి కోసం రోడ్డెక్కిన కార్మికులు

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వం తరఫున బట్ట ఉత్పత్తి ఆర్డర్లను ఇవ్వాలని, ప్రభుత్వ బకాయిలు రూ.250 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పవర్‌లూం కార్మికులు ఆందోళన బాటపట్టారు. ఆత్మహత్య చేసుకున్న తడక శ్రీనివాస్ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆసాముల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా చేశారు. వారం రోజులుగా సిరిసిల్ల కార్మికులకు ఉపాధి కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు. ఆసాముల సంఘం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది. బీవైనగర్‌లో ఆసాముల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో 8 రోజులుగా నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. కార్మికులను ఉపాధి కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 14న 24 గంటల నిరాహారదీక్షకు సిద్ధమయ్యారు. 15న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టనున్నారు. మరోవైపు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని, కార్మిక సంఘాల నాయకులు చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతోపాటు జౌళి శాఖ అధికారులు, ఇతర మంత్రులను కలిసి విన్నవించినా ఫలితం లే కుండా పోయి ందని కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సిరిసిల్లలో రాస్తారోకో చేస్తున్న కార్మికులు

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు అందుకున్న విద్యార్థులు

తంగళ్లపల్లి, మార్చి 26: రాష్ట్రస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీలలో తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇటీవల కరీంనగర్‌లో బ్రూస్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ లెవెల్ ఓపెన్ టు ఆల్ స్టైల్స్ కుంగ్ ఫూ, కరాటే ఛాంపియన్ షిప్ పోటీలతోపాటు వేములవాడలో ఒకినోవా స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో ప్రతిభ కనబరిచారు. కటాఫ్ విభాగంలో హర్షిని రెండు బంగారు పతకాలు, కావ్య ఒక బంగారు పతకం, సాన్వి, జాహ్నవి వెండి పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జనార్దన్, కరాటే మాస్టర్ నాగుల కనకయ్య ఉపాధ్యాయులు అభినందించారు.

మొబైల్ ఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై

తంగళ్లపల్లి, మార్చి 12: సీఈఐఆర్ అప్లికేషన్ సహాయంతో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను పట్టుకొని బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన ఉదయ్‌చౌదరి తన ఫోన్ పోయిందని తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మొబైల్ ఫోన్ వివరాలను సీఈఐఆర్ అప్లికేషన్ ఆధారంగా మంగళవారం మొబైల్ ఫోన్ లోకేషన్ గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు, బాధితుడికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

పథకాల అమలులో అగ్రగామిగా నిలుస్తున్నాం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న యువజన సంఘం సభ్యులు

ఇల్లంతకుంట, మార్చి 12: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రంలో యువజన సంఘం భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. యువజన సంఘం అధ్యక్షుడు ఉప్పల అమర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రజల అవసరాలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ గ్యారంటీలను ప్రకటించి అమలు చేస్తోందన్నారు. యువకులు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకుండా యువకుల జీవితాలతో చెలగాటం ఆడిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన మేరకు భారీ ఎత్తున ఉద్యోగ నోటిఫికేషన్లు వేశారని తెలిపారు. యువత సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంఘం భవనాన్ని విజ్ఞానకేంద్రంగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, యువజన సంఘం అధ్యక్షుడు ఉప్పల అమరేందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అయిలయ్య, యువజన సంఘాల నాయకులు మామిడి రాజు, రజనీకాంత్, బండారి రాజు, బాలకృష్ణ, రవితేజ, రేగుల కార్తీక్, పిల్లి సుధీర్, శివరాం, సంతోష్, ప్రశాంత్, నిఖిల్‌తోపాటు యువకులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ భవనానికి భూమిపూజ

మండలకేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవనానికి ఎమ్మెల్యే సత్యనారాయణ భూమిపూజ చేశారు. అవినీతిని వెలికి తీసి పాత్రికేయులు ఆదర్శంగా నిలవాలన్నారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం వైశ్యభవనంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న గ్యారంటీలను ఇంటింటికీ తీసుకెళ్లాలని, పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ ఘన విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తూముకుంట శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షులు బొల్గం పర్శరాం, మారుపాక అనీల్ కుమార్, సీనియర్ పాత్రికేయులు దొడ్ల దేవేందర్, బట్టు శ్రీనివాస్, గుర్రాల మోహన్, రాకం సుమన్, శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని వీడాలి

- డీఈవో రమేష్‌కుమార్



శివనగర్ పాఠశాలలో మాట్లాడుతున్న డీఈవో రమేష్‌కుమార్

సిరిసిల్ల రూరల్, మార్చి 12: విద్యార్థులకు పదోతరగతి ఉత్తీర్ణత తొలిమెట్టని, పరీక్షలంటే భయాన్ని వీడాలని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులకు హాల్ టిక్కెట్‌లను అందజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డీఈవో మాట్లాడారు. పదోతరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. 10జీపీఏ సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లాకావత్ మోతిలాల్, స్టాఫ్ సెక్రెటరీ మల్లారపు పురుషోత్తం, ఉపాధ్యాయులు పాతూరి మహేందర్‌రెడ్డి, పాకాల శంకర్‌గౌడ్, కుమ్మరి మల్లేశం, శ్రీహరి, సాంబయ్య, లక్ష్మయ్య, నారాయణ, ప్రభాకర్, నసీరుద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, లింగమూర్తి, వెంకటస్వామి, సరిత, సంధ్యారాణి, ఫాతిమా, నీరజ, సత్యకుమారి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ప్రభుత్వ విప్ కృతజ్ఞతలు



కృతజ్ఞతలు తెలుపుతున్న ఆదిశ్రీనివాస్

వేములవాడ టౌన్, మార్చి 12: బీసీ, ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గాలకు 16 కార్పొరేషన్‌ల ఏర్పాటుకు ఆమోదం తెలిపిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి వేములవాడ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను, మంత్రులు పొన్నం ప్రభాకర్‌ను, దుద్దిళ్ల శ్రీధర్ బాబును, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దనసరి సీతక్క, కొండా సురేఖను ప్రత్యేకంగా కలిశారు. కార్పొరేషన్‌ల ఏర్పాటుకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 12 : జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీలకు చెందినవారు డీఎస్సీ ఎస్జీటీ ఉచిత శిక్షణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 22లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. వివరాల కోసం 0572323004, 9381888746లలో సంప్రదించాలని సూచించారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి..

తంగళ్లపల్లి, మార్చి 12: తంగళ్లపల్లి, మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో జనరల్ డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రజిని ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి జనరల్ డిగ్రీలో సీబీసీఎస్ విధానంలో ఫిజికల్ సైన్స్, లైఫ్ సైన్స్, బీకామ్ సీఏ, బీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గిరిజన, గిరిజనేతర విద్యార్థులు టీజీ యూజీ సెట్ 2024- 25కి, దోస్త్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9502082958 నంబరులో సంప్రదించాలన్నారు.

కమనీయం.. రేణుకాఎల్లమ్మ జమదగ్నిల కల్యాణం

ఎల్లారెడ్డిపేట, మార్చి 12: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ సిద్దోగం వేడుకలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు ఎల్లమ్మ బోనాలను ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం రేణుకాఎల్లమ్మ జమదగ్నిల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. సీఎం వీఆర్వో బొల్గం శ్రీనివాస్, ఎస్ఆర్ఐ రాధారపు సత్యం, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

ముస్తాబాద్, మార్చి 12: మండలంలోని తెర్లుమద్ది గ్రామంలో యాదవ సామాజిక వర్గం ఆధ్వర్యంలో మంగళవారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో యాదవ సామాజిక వర్గం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మల్లన్న ఉత్సవాల్లో భాగంగా మహిళలు పెద్ద ఎత్తున పోచమ్మ బోనాలు తీశారు. కార్యక్రమంలో యాదవ కుర్మ సామాజిక వర్గ సభ్యులు మల్లేశ్, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలన

ఇల్లంతకుంట, మార్చి 12: మండలంలో పెద్దలింగాపూర్ గ్రామంలో సాగు నీరు లేక ఎండిపోయిన పంటలను ఆర్డీవో రమేష్ మంగళవారం పరిశీలించారు. సాగునీరు లేక పంటలు ఎండిపోవడంతో గ్రామానికి చెందిన నలుగురు రైతులు సోమవారం వరిచేన్లకు నిప్పుపెట్టారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో జరిగిన పంటనష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జావెద అహమ్మద్, డీటీ సత్యనారాయణ, వ్యవసాయాధికారి సురేష్, ఏఈ సమరసేన పాల్గొన్నారు.

ఇంటి పన్ను బకాయిలను వసూలు చేయాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 12: వంద శాతం ఇంటి పన్ను బకాయిలను సకాలంలో వసూలు చేయాలని డీఎల్‌పీవో మల్లికార్జున్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం ఇంటి పన్ను బకాయిల వసూలు తీరును పరిశీలించారు. గ్రామంలో రూ.25 లక్షల బకాయిలు ఉన్నాయని వాటిని వసూలు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఆయన పంచాయతీ కార్యదర్శి దేవరాజు, జూనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ, సిబ్బంది రామచంద్రం ఉన్నారు.

మహిళలకు మగ్గం వర్క్‌పై శిక్షణ

ఎల్లారెడ్డిపేట, మార్చి 12: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ సేవా కేంద్రంలో నాబార్డు, స్పందన ఫౌండేషన్ సౌజన్యంతో మహిళలకు మగ్గం వర్క్‌పై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. మగ్గంపై 15 రోజుల పాటు శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రామచంద్రం, మల్లారెడ్డి, కిషన్, శ్రీనివాస్‌రెడ్డి, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కోనరావుపేట, మార్చి 12: మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి గురుజాల శ్రీధర్ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ విజయ్ రామారావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కవిత, సంధ్య, రాధ, వసంత, దేవవ్వ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఉన్నప్పుడు ఎకరమైనా ఎండిందా?

- కరీంనగర్ కదనభేరి సభలో
బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్



సభలో మాట్లాడుతున్న కేసీఆర్

కరీంనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'కేసీఆర్ ఉన్నప్పుడు రాష్ట్రంలో ఒక్క ఎకరం పొలం ఎండిందా.. ఇప్పుడు గా బీమారి ఎందుకు వచ్చింది.. గది పోవాలే.. మేడిగడ్డ పిల్లర్లు కుంగితే దేశమంతా ఏమో అయినట్లు పెడబొబ్బలు పెడుతూ నన్ను బదనాం చేస్తారా.. ఒక ముఖ్యమంత్రి అయి ఉండి చీరుతా, పండబెట్టి తొక్కుతా, మానవ బాంబును అవుతా అని అంటాడా, ఇవి ఒక ముఖ్యమంత్రి మాట్లాడే మాటలేనా' అని బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశ్నించారు. కరీంనగర్ ఎస్సారార్ గ్రౌండ్‌లో మంగళవారం బీఆర్ఎస్ కదనభేరి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీపై విమర్శనాస్త్రాలు సంధించారు. మూడు నెలల్లో ముఖ్యమంత్రి, మంత్రులు తొమ్మిదిసార్లు ఢిల్లీకి వెళ్లారని, వాళ్లు ఢిల్లీకి సూటు కేసులు మోసే పనిలో బిజీగా ఉన్నారని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పెద్దలకు తాకట్టు పెడుతున్నారని, తెలంగాణకు బీఆర్ఎస్సే రక్ష అని తెలిపారు.

కరీంనగర్ పోరాటాల గడ్డ

కరీంనగర్ పోరాటాల గడ్డ అని, చైతన్యం ఉన్న జిల్లా అని, బీఆర్ఎస్ జెండాను ఆకాశమంత ఎత్తిన గడ్డ అని కేసీఆర్ కొనియాడారు. తెలంగాణ సాధించే వరకు అండగా ఇక్కడి ప్రజలు నిలిచారని అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అత్యాశకు పోయి మోసపోయి కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. వంద రోజుల వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏమీ అనవద్దని తమ ఎమ్మెల్యేలకు చెప్పానని, కానీ ఏం జరిగిందో మీరు చూస్తున్నారని అన్నారు. ఆరు చందమామలు, ఏడు సూర్యులు పెడతామని, రైతుబంధు 15 వేలు ఇస్తామని, కల్యాణలక్ష్మి ద్వారా తులం బంగారం ఇస్తామని, 420 హామీలు ఇచ్చారని ఎద్దేవా చేశారు. రైతుబంధు ఏమైందంటే ఒక మంత్రి రైతులను చెప్పుతో కొడతానని అంటాడా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఏమో పండబెట్టి తొక్కుతా, చీరుతా, మానవబాంబును అవుతా, ఒక ముఖ్యమంత్రి మాట్లాడే భాష ఇదేనా అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో సమైక్యాంధ్రులు తెలంగాణను అడ్డుకున్నప్పుడు చవట, సన్నాసి అని మాట్లాడానని, ముఖ్యమంత్రిగా తాను పదేళ్లలో ఇలాంటి దురుసు మాటలు మాట్లాడలేదని కేసీఆర్ తెలిపారు.

అన్నింటికీ ఎగనామం పెడతారు

తమ హయాంలో రెప్పపాటు క్షణం పాటు కరెంటు పోకుండా 24 గంటలు ఇచ్చామని, కరోనా వచ్చినా కూడా అప్పో సప్పో చేసి రైతుబంధు ఇచ్చామని గుర్తు చేశారు. ఇప్పుడు కరెంటు కటకాలు బంద్ పెడతారా, ఈ చవటలు, దద్దమ్మలు కరెంటు బంద్ చేస్తారా అని మండిపడ్డారు. 6 గ్యారంటీలు లేవు మూడు గ్యారెంటీ లేవు.. అన్నింటిని ఎగనామం పెడతారని విమర్శించారు. రాష్ట్రంలో 33 జిల్లాలు చేస్తే ఆనాడు నరేంద్ర మోదీ కొత్త జిల్లాలకు నవోదయ విద్యాలయాలు ఒకటి కూడా ఇవ్వలేదని, దేశంలో 150 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే, అందులో రాష్ట్రానికి ఒక్కటి కూడా ఇవ్వలేదని విమర్శించారు.

బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి ఏం తీసుకొచ్చారు?

ఎంపీ బండి సంజయ్ ఏమైనా పని చేశాడా, ఈ రాష్ట్రానికి బీజేపీ ఎంపీలు ఏమైనా తీసుకువచ్చారా అని నిలదీశారు. కరీంనగర్ కోసం వినోద్‌కుమార్ స్మార్ట్‌సిటీని, నేషనల్ హైవేలు, రైల్వే లైన్ తీసుకోవచ్చారని చెప్పారు. బండి సంజయ్‌కు వినోద్‌కు పోలిక లేదని అన్నారు. తాము ఒక పద్ధతి ప్రకారం రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోయామని, దేశంలో ఎవరూ ఇవ్వని విధంగా రైతుబంధు, రైతు బీమా పథకాన్ని అమలు చేశామన్నారు. పరిశ్రమలు ఐటీని అభివృద్ధి చేశామన్నారు.

కాళేశ్వరంపై అందరికీ వివరిస్తా..

మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగితే దేశంలో ఏమో జరిగినట్టు పెడబొబ్బలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. ఒక పన్ను ఊడిపోతే 32 పనులు ఊడగొట్టుకుంటామా అని ప్రశ్నించారు. రెండు మూడు రోజుల్లో టీవీల ముందుకు వచ్చి కాళేశ్వరం ప్రాజెక్టు గురించి అన్ని విషయాలు వివరిస్తానని చెప్పారు. గత ఏడాది మిడ్ మానేరు లోయర్ మానేరు డ్యాంలో ఈ సమయానికి నీళ్లు ఉన్నాయని, చెరువులు మత్తళ్లు దూకాయన్నారు. ఇప్పుడు కరెంటు బంద్ కావడం, రైతులు పొలాలను తగలబెట్టడం, పంటలో గొర్లు, బర్లతో ఎందుకు మేపుతున్నారో ఆలోచన చేయాలన్నారు.

అదనపు కట్నం కేసు నమోదు

వీణవంక,మార్చి12: మండల కేంద్రానికి చెందిన నీల సాయి కిరణ్, మంచిర్యాల జిల్లా నస్పూర్ కాలనీకి చెందిన మారపాక రమ్య ప్రేమ వివాహం చేసుకున్నారు. రెండు నెలలుగా అదనపు కట్నం తీసుకురావాలని తనను వేధిస్తున్నట్లు రమ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కిరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

బాలిక కిడ్నాప్ : కేసు నమోదు

రామడుగు, మార్చి 12: మండలంలోని గోపాల్‌రావుపేటలో బాలికను కిడ్నాప్ చేసిన ఓ ప్రైవేటు ఉపాధ్యాయుడిపై కేసు నమెదు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ సురేందర్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోపాల్‌రావుపేటలో ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న బాలికను అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కిడ్నాప్ చేశాడని బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రైవేటు ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాలువ నీటి కోసం రైతుల రాస్తారోకో


చొప్పదండిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

చొప్పదండి, మార్చి 12: తమ పంటలకు కాలువ నీరు అందడం లేదని, పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చేశారు. చొప్పదండి శివారులో డి87 కాలువ వద్ద రాయపట్నం రహదారిపై మంగళవారం కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లితో పాటు మండల రైతులు రాస్తారోకో చేశారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ నీటిని వారబంధీ పద్ధతిలో ఆయకట్టుకు అందిస్తున్నారని డి-87 కాలువకు నీటిని వదిలినా చివరి పొలాలకు నీరు అందడం లేదని పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువ చివరి పొలాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు.అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కాగా చామనపల్లి రైతులతో పాటు కాలువ ఆయకట్టు పరిధిలోని పలు గ్రామాల రైతులు ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మండలాధ్యక్షులపై అవిశ్వాసాలు పెట్టొచ్చు

- నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోలకు ఉంది
- హైకోర్టు స్పష్టీకరణ .. పలువురి దావాల కొట్టివేత

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు వ్యతిరేకంగా వచ్చిన అవిశ్వాస తీర్మానాలపై సమావేశాలు నిర్వహించే అధికారం ఆర్డీవోలకు ఉందని హైకోర్టు తేల్చిచెప్పింది. పలు మండలాల అధ్యక్షులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. తమకు వ్యతిరేకంగా అవిశ్వాస సమావేశాలు నిర్వహించేలా ఆర్డీవోలు నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ ఎంపీపీ ఉమాదేవి, రామన్నపేట్ ఎంపీపీ జ్యోతి, మద్నూర్ ఎంపీపీ లక్ష్మీబాయి, రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి, వరంగల్ జిల్లా గీసుకొండ ఎంపీపీ సౌజన్య, రంగారెడ్డి జిల్లా మర్రిగూడ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సరూర్‌నగర్ ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, నల్లగొండ జిల్లా చండూర్ ఎంపీపీ పల్లె కల్యాణి, కరీంనగర్ జిల్లా రామడుగు ఎంపీపీ కలగంటి కవిత, ఆదిలాబాద్ జిల్లా ఏలూరు సారంగాపూర్ మండల ఉపాధ్యక్షుడు, జనగాం జిల్లా మల్యాల ఎంపీపీ విమల, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ ఎంపీపీ సువర్ణ, డిచ్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలానికి చెందిన సుజాత, ప్రభాకర్ తదితరులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్డీవోల నుంచి తమకు అవిశ్వాస నోటీసులు అందాయని, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 263 ప్రకారం ఆ నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోకు లేదని పేర్కొన్నారు. ఈ నోటీసులను కొట్టివేయాలని కోరారు. విచారణ చేపట్టిన జస్టిస్ కే శరత్ ధర్మాసనం నోటీసులు జారీ చేసే అధికారం ఆర్డీవోలకు ఉందని తెలిపింది. సాంకేతిక కారణాలు చూపించి అవిశ్వాసాన్ని తప్పించుకోలేరని పేర్కొంది.

గుదిబండగా కరెంటు ఒప్పందాలు

ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తును వాడకున్నా.. రూ.వందల కోట్లలో బిల్లుల బకాయిలు.. న్యాయ విచారణకు సర్కారు నిర్ణయం

- జస్టిస్ నర్సింహారెడ్డితో కమిషన్
- యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లపైనా విచారణ



హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గుదిబండగా మారిన ఛత్తీస్‌గఢ్ కరెంటు ఒప్పందాల దుమ్మును దులపాలని రేవంత్‌రెడ్డి సర్కారు నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటును కొనుగోలు చేయకున్నా.. ప్రస్తుతం ఒక్కయూనిట్ సరఫరా లేకున్నా.. వేల కోట్లలో బిల్లులు కట్టాల్సి రావడంపై న్యాయ విచారణకు ఆదేశించింది. ఇందుకోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అంతేకాదు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లపైనా ఈ కమిషన్ విచారణ జరుపుతుంది.

ఇదీ ఛత్తీస్‌గఢ్ కరెంటు కథ?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. విద్యుత్తు అవసరాలను తీర్చాలనే ఉద్దేశంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 2015 సెప్టెంబరు 22న ఛత్తీస్‌గఢ్‌లోని 1,000 మెగావాట్ల మార్వా ప్లాంట్ నుంచి 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ మేరకు పీపీఏ కింద తెలంగాణ డిస్కమ్‌లు, సీఎస్‌పీడీసీఎల్(ఛత్తీస్‌గఢ్) ఒప్పందాలపై సంతకాలు చేశాయి. అప్పట్లోనే విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ అభ్యంతరాలు వ్యక్తం చేసినా.. ప్రభుత్వం కౌంటర్ సమర్థనలను చేయిస్తూ.. ముందుకెళ్లింది. ఇక ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు సరఫరాకు వీలుగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్(పీజీసీఐఎల్)తోనూ ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ కరెంటును కొనుగోలు చేయకపోవడంతో.. పెనాల్టీ కింద రూ.300 కోట్లను పీజీసీఐఎల్‌కు చెల్లించాలని కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి(సీఈఆర్సీ) ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. బకాయిల పేరుతో మార్వా ప్లాంట్ నుంచి విద్యుత్తు సరఫరా జరగకున్నా.. పాయింట్ ఆఫ్ కనెక్షన్ చార్జీలు(పీవోసీ) రూపంలో ఏటా రూ.400 కోట్ల నుంచి రూ.450 కోట్లను చెల్లించాల్సి వస్తోంది. స్థిర చార్జీల భారం కూడా తెలంగాణ డిస్కమ్‌లను వీడడం లేదు. 2020-21లో రూ.828.13 కోట్లు, 2021-22లో రూ.394.98 కోట్ల మేర స్థిరచార్జీలను చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం కాస్తా లేట్‌పేమెంట్‌తో కలుపుకొని రూ.3,576.89 కోట్లకు పెరిగినట్లు ఛత్తీస్‌గఢ్ చెబుతుండగా.. అది కేవలం రూ.2,100 కోట్లేనని తెలంగాణ డిస్కమ్‌లు వాదిస్తున్నాయి. కరెంటు బిల్లుల బకాయిలున్నాయంటూ రెండేళ్ల క్రితమే ఛత్తీస్‌గఢ్ కరెంటు సరఫరా నిలిచిపోయింది. నిజానికి తెలంగాణ డిస్కమ్‌లు 2021-22లో 1,631 మిలియన్ యూనిట్లు(కేవలం 19%) కొనుగోలు చేశాయి. 2022-23 ద్వితీయార్థంలో 2,713 మిలియన్ యూనిట్ల(31%) విద్యుత్తును కొనాలని అంచనాలు వేసినా.. ఆ పరిస్థితి లేదని తేలిపోయింది. 2023-24లో 78% విద్యుత్తు కొంటామనే అంచనాలున్నాయి. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు బకాయిల పేరుతో ఆ మేరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేశాయి. రెండేళ్లుగా కరెంటు సరఫరా లేకున్నా.. 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలు ఒప్పందం బూచీగా ఇప్పుడు తెలంగాణ డిస్కమ్‌లపై భారం పడే ప్రమాదం ఉంది. ఒప్పందంలో ఇంకా ఆరేళ్లు మిగిలే ఉన్నాయి. పీపీఏ ఒప్పందం ప్రకారం విద్యుత్తును కొనకుంటే.. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు ఆ కరెంటును ఓపెన్‌యాక్సెస్‌లో విక్రయించుకోవచ్చు. ఒకవేళ తెలంగాణ ఒప్పందం కంటే.. ఓపెన్‌యాక్సెస్ విక్రయం తక్కువ ధరలో ఉంటే.. ఆ భర్తీని తెలంగాణ డిస్కమ్‌లు భరించాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ బకాయిలన్నీ తెలంగాణ డిస్కమ్‌ల పాలిట గుదిబండగా మారాయి. దీనిపై తెలంగాణ డిస్కమ్‌లు 2018లో విద్యుత్తు అప్పిలేట్ ట్రిబ్యునల్(అప్టెల్)ను ఆశ్రయించినా.. ఆ కేసు తేలే దాకా ఇబ్బందులు తప్పేలా లేవు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన ఈ తొందరపాటు ఒప్పందాలపై ఇప్పుడు రేవంత్ సర్కారు విచారణ జరిపించనుంది. మరోవైపు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లను వినియోగించుకోవాలా? వదిలేయాలా? అంటూ ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. భద్రాద్రిలో ఒక్కో ప్లాంట్ 270 మెగావాట్ల సామర్థ్యంతో.. మొత్తం నాలుగు ప్లాంట్లు 1,080 మెగావాట్లను ఉత్పత్తి చేస్తాయి. ఈ ప్లాంట్‌పై అప్పట్లోనే తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అందుబాటులో ఉన్నా.. సబ్-క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్ కట్టడంపై నిపుణులు విమర్శలు చేశారు. 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి ప్లాంట్ ఇంకా నిర్మాణంలోనే ఉంది. ఇక్కడ కూడా భూసేకరణ, టౌన్‌షిప్‌ల నిర్మాణం, సబ్-కాంట్రాక్టుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ అంశాలపైనా జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ జరపనుంది.

ఫలించిన 15 ఏళ్ల నిరీక్షణ

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల డీఎస్సీ 2008 అభ్యర్థుల హర్షం
- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరిగిందని ఆనందం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2008లో అర్హత పొంది, నియామకాలు పొందని అభ్యర్థులకు కనీస వేతనాల పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తాము 15 ఏళ్లుగా పడుతున్న కష్టాల నుంచి ప్రభుత్వ ప్రకటనతో ఉపశమనం కలిగిందన్నారు. మంగళవారం సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద అభ్యర్థులు, అసోసియేషన్ ప్రతినిధులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... దశాబ్దంనర కాలంగా ఎదురుచూపులు నేడు ఫలించాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తమకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి, తమకు కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకొచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో పాటు ఇతర అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. త్వరగా విధివిధానాలు ప్రకటించాలని వారు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 'డీఎస్సీ 2008 అసోసియేషన్' అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాకు ఉద్యోగాలు ఇవ్వండి

- డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ టీచర్ల మొర
- వేర్వేరు సమస్యలపై 'ప్రజావాణి'కి 1470 అర్జీలు



పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న బాలుడు గౌతమ్

సికింద్రాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తమకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలంటూ డీఎస్సీ 1998లో అర్హత సాధించిన ఉపాధ్యాయులు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. 1998 డీఎస్సీలో నియామక ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగిందని, ఎన్నికలు రావడంతో 1999లో డీఎస్సీ ప్యానల్‌ను రద్దు చేశారన్నారు. దాంతో డీఎస్సీ-98లో క్వాలిఫై అయిన అభ్యర్థులు ఉద్యోగావకాశాలు కోల్పోయారని తెలిపారు. ఈ మేరకు ప్రజాభవన్‌కు తరలివచ్చిన పలువురు అభ్యర్థులు ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారు. ఇదే కాదు.. రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణి సమస్యలు, ఉద్యోగాలు, వైద్యంతోపాటు వేర్వేరు సమస్యలపై ప్రజావాణికి మంగళవారం 1,470 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ పరమైన సమస్యలు 327, ఇంటి కోసం 251, పంచాయతీరాజ్ విభాగానికి 200, మైనార్టీ వెల్ఫేర్ సంబంధించి 145అర్జీలు ఉన్నాయి. ఆయా దరఖాస్తులను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జీ.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య, ఇతర అధికారులు ప్రజలను స్వీకరించారు. సంబంధిత విభాగాల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, పుట్టుకతో అంగవైకల్యంతో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేయాలని నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన దండు గౌతమ్ (13) దరఖాస్తు చేసుకున్నాడు. ఆరో తరగతి విద్యార్థి అయిన గౌతమ్ లేచి నిలబడాలన్నా, కూర్చోవాలన్నా ఇతరులపై ఆధారపడే స్థితిలో ఉన్నాడు. అలాగే, రైలు ప్రమాదంలో తగిలినగాయాల వల్ల తన కాలు, చెయ్యి పని చెయ్యడం లేదని, ఆర్థిక సమస్యల్లో ఉన్న కుటుంబాన్ని పోషించుకునేందుకు తనకు ఉద్యోగం ఇప్పించాలని నాంపల్లి నేతాజీనగర్‌కు చెందిన జి.శశికాంత్ దరఖాస్తు చేసుకున్నారు. ఉప్పల్‌కు చెందిన పలువురు వృద్ధ మహిళలు తమకు పెన్షన్ మంజూరు చేయాలని, అంబర్‌పేటకు చెందిన పలువురు మహిళలు రేషన్ కార్డు కోరుతూ అర్జీలు పెట్టారు. కాగా, తమ ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని, వేతనాన్ని రూ.19,500కు పెంచాలని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్ టైమ్ స్వీపర్లు అర్జీ చేసుకున్నారు. గత ప్రభుత్వం తీరు వల్ల 1500 మంది అభ్యర్థులు ఉద్యోగాలు లేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన జూనియర్ లైన్‌మెన్లు అభ్యర్థించారు. బేగంపేట్‌లోని ఈశ్వరీయ విశ్వ విద్యాలయ కేంద్రంలో నిర్వహించే ఆధ్యాత్మిక తరగతులకు తమ ను రానివ్వడం లేదంటూ పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు.



అంటువ్యాధుల నివారణ కోసం నిర్మించబోయే ప్రయోగశాల భూమిపూజలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు

అంటువ్యాధుల నివారణకు ప్రయోగశాల

- 25 కోట్లతో ఐఐపీహెచ్ ఆవరణలో ఏర్పాటు
- హిమాయత్‌సాగర్‌లో భూమిపూజ
- భవిష్యత్‌లో పలు పరిశోధనలు

రాజేంద్రనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు హిమాయత్‌సాగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఐఐపీహెచ్) ఆవరణలో రూ.25 కోట్లతో ప్రయోగశాల(సైరస్ పూనావాలా సెంటర్ ఫర్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ అండ్ పాండమిక్ ప్రిపేర్డ్‌నెస్) నిర్మించనున్నట్లు ఐఐపీహెచ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ మధుబాల రెంటల తెలిపారు. ఈ సెంటర్‌కు భూమిపూజను విల్లో పూనావాలా ఫౌండేషన్ సీఈవో జస్వీందర్ నారంగ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ సి. శ్రీనివాస రాజు, ఐఐపీహెచ్ చీఫ్ మెంటార్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సంజయ్ జొడెపె, యూఎస్‌ఏకు చెందిన డాక్టర్ అనిల్ కౌల్‌తో కలిసి మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ సెంటర్ అంటువ్యాధులను ఎదుర్కోవడానికి అంకితమైన మార్గదర్శక కేంద్రంగా పనిచేస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలను సూచించడంలో ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ వారు క్యాన్సర్ స్క్రీనింగ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో సుమారు రూ.10 కోట్ల విలువ చేసే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే బస్సును ఐఐపీహెచ్‌కు బహూకరించారు. ఈ బస్సులో ఇక మీదట గ్రామాల్లో తిరుగుతూ మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మూడు బోర్లు వేసి అప్పుల పాలై రైతు ఆత్మహత్య

- మెదక్ జిల్లాలో కిష్టాపూర్‌లో ఘటన
- విద్యుదాఘాతంతో మహిళా రైతు, ఎలక్ట్రీషియన్ మృతి

చేగుంట, అడ్డగూడూరు, కోదాడ రూరల్, మార్చి 12: చేతికొచ్చే సమయంలో పంట ఎండిపోకూడదని మూడు బోర్లు వేయించినా చుక్క నీరు రాకపోగా.. అప్పుల పాలవ్వడంతో కలత చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధి కిష్టాపూర్‌కు చెందిన కుర్మ స్వామి(30) అనే రైతు తన పొలంలోని చెట్టుకు మంగళవారం ఉరి వేసుకుని మరణించాడు. కుర్మ స్వామి తనకున్న నాలుగు ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు మూడు బోర్లు వేశారు. బోర్లు వేసేందుకు, పంట సాగుకు సుమారు నాలుగు లక్షల అప్పు చేశారు. నీళ్లు రాక పొలం ఎండిపోగా, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుర్మ స్వామికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, పొలంలో కింద పడి ఉన్న 11కేవీ త్రీఫేజ్ మెయిన్ వైరును తొక్కి విద్యుదాఘాతానికి గురై యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామానికి చెందిన బోనాల లక్ష్మి(40) అనే మహిళా రైతు ప్రాణాలు కోల్పోయారు. లక్ష్మి రోజు మాదిరిగా మంగళవారం సాయంత్రం పొలంకు వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. ఇక, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన షేక్ జానీమియా(35) అనే ఎలక్ట్రీషియన్ తన ఇంట్లో తెగిన విద్యుత్ తీగకు మర్మమతుల చేస్తూ విద్యుదాఘాతానికి గురై మరణించాడు.

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో 4,356 అధ్యాపక పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకం
- నోటిఫికేషన్ జారీ.. 16న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు
- నాణ్యమైన విద్యే లక్ష్యం: మంత్రి దామోదర

పోస్టులు	ఖాళీల సంఖ్య	వేతనం (రూ.లలో)
ప్రొఫెసర్	498	1,90,000
అసోసియేట్ ప్రొఫెసర్	786	1,50,000
అసిస్టెంట్ ప్రొఫెసర్	1459	1,25,000
సీనియర్ రెసిడెంట్స్	1201	92,575
ట్యూటర్స్	412	55,000

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీర్చేందుకు రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. 2021 అక్టోబరు నుంచి ఖాళీగా ఉన్న 4,356 టీచింగ్ పోస్టులను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయాలన్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నం.98 విడుదల చేసింది. ఇందులో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీతో ఏటా సర్కారుపై అదనంగా రూ.634 కోట్ల భారం పడుతుందని మంత్రి తెలిపారు. మెడికల్ కాలేజీల్లోని అధ్యాపకుల నియామకాలన్నీ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీల ద్వారా సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల బలోపేతం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జాతీయ వైద్య కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడానికి పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. కాగా, కాలేజీల వారీగా పోస్టుల వివరాలను ఆయా కాలేజీల వెబ్‌సైట్లలో పొందుపర్చారు. కాలేజీల వెబ్‌సైట్ల వివరాలు డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో (htpps://dme.telangana.gov.in) ఉన్నాయి. అన్ని కాలేజీల్లో ఈ నెల 16న వాక్-ఇన్-ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అర్హతలున్న అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

లోక్‌సభ ఎన్నికలకు ఖర్గే దూరం!

- ఒక నియోజకవర్గానికే పరిమితం కాదలుచుకోలేదు: ఏఐసీసీ చీఫ్
- దేశవ్యాప్తంగా దృష్టి పెడతానని వెల్లడి
- గుల్బర్గా నుంచి అల్లుడిని దింపే చాన్స్

న్యూఢిల్లీ, మార్చి 12: ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున ఖర్గే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ ఎన్నికలు అత్యంత కీలకమని, పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. తాను కూడా పోటీ చేస్తే ఒక నియోజకవర్గంపైనే దృష్టి పెట్టి, అక్కడే పరిమితం కావాల్సి ఉంటుందని ఖర్గే అభిప్రాయపడ్డారు. అయితే, పార్టీ వర్గాలు మాత్రం ఆయన పోటీ చేయాలని కోరుకుంటున్నాయి. ఈ ఎన్నికలను వదులుకోకూడదని, పోటీలో ఉండే పార్టీని ముందుండి నడిపించాలని వారు చెబుతున్నారు. కానీ, వీరి వాదనను ఖర్గే తోసిపుచ్చుతున్నారు. "రానున్న ఎన్నికలు అత్యంత కీలకం. పార్టీ చీఫ్‌గా ఒకే నియోజకవర్గానికి పరిమితం కాలేను. దేశవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలపైనా దృష్టిపెట్టాల్సి ఉంది" అని ఖర్గే తెలిపారు. కర్ణాటకలోని గుల్బర్గా నియోజకవర్గం నుంచి ఖర్గేని రంగంలోకి దింపాలని గత వారం జరిగిన సమావేశంలో నేతలు ఏకగ్రీవంగా భావించారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును జాబితాలోనూ చేర్చారు. అయితే, ఖర్గే పోటీకి దూరంగా ఉండి, ఈసారి తన అల్లుడు రాధాకృష్ణన్ దొడ్డమాని బరిలో నిలపాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. గుల్బర్గా నియోజకవర్గం నుంచి వరుసగా రెండు సార్లు విజయం సాధించిన ఖర్గే 2019 ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పెద్దల సభలో విపక్ష నాయకుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. మరో నాలుగేళ్లు ఆయన పదవీ కాలం ఉంది. ప్రస్తుతం ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే సిద్దరామయ్య మంత్రి వర్గంలో కేబినెట్ మంత్రిగా ఉన్నారు. తొలుత ప్రియాంక్‌ను పార్లమెంటు బరిలో నిలపాలని అనుకున్నా.. తర్వాత ఈ నిర్ణయాన్ని పార్టీ వెనక్కి తీసుకుంది. ఇదిలా వుంటే, ఖర్గే కనుక పోటీ చేయకపోతే, ఏఐసీసీ అధ్యక్షులుగా ఉండి ఎన్నికలకు దూరంగా ఉన్న వారిలో ఈయనే తొలి నాయకుడు అవుతారు.

పార్లమెంట్ ఎన్నికలను
కట్టుదిట్టంగా నిర్వహించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 12: భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం రాబోయే పార్లమెంటు ఎన్నికలను కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం హౌస్ ఆఫ్ పార్లమెంట్‌కు జరగబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యా నాయక్, డీఆర్వోతో సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల కమిషన్‌ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలలో అమలు చేయాలన్నారు. అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన మేర పోలింగ్ సిబ్బందిని సన్నద్ధం చేసుకోవాలన్నారు. ఈవీఎం యంత్రాల మొదటి స్థాయి చెకింగ్ నివేదికల సమర్పించాలని, 18 సంవత్సరాలపై వయస్సు గల ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనే ప్రణాళిక తయారు చేసుకోవాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతీ పోలింగ్ కేంద్రం పరిధిలో దివ్యాంగులను మ్యాపింగ్ చేయాలని, పోలింగ్ రోజున అవసరమైన రవాణా సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణపై సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలను నిరంతరం పరిశీలించాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన రిపోర్టులను తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రముఖులను గుర్తించి వారితో ఓటు ప్రాముఖ్యతపై అవగాహన వీడియోలు రూపొందించాలన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఓటర్ అవగాహన కార్యక్రమాల గురించి ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల్లో ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియాలో ప్రచారం చేయాలన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల లోకేషన్, పేరు మార్పులపై అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. జిల్లాలోని ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. ఓటర్ జాబితా సవరణలో భాగంగా మరణించిన వ్యక్తుల, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలి వెళ్లిన వారి ఓటు వివరాలు నిబంధనల ప్రకారం తొలగించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కృత్రిమ కరువు సృష్టించాలని చూస్తున్న కేటీఆర్, హరీష్

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్


భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, మార్చి 12: తెలంగాణ రాష్ట్రంలో కృత్రిమ కరువు సృష్టించాలని బావ,బామ్మర్దులు కేటీఆర్, హరీష్‌రావు చూస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం అనుపురం, చంద్రగిరి, చీర్లవంచ గ్రామాల్లో గృహజ్యోతి కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతీ ఒక్కరు సంతోషంగా ఉన్నారన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, రూ.500కు గ్యాస్ సిలిండర్‌తో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతోపాటు ప్రతీ ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 10 లక్షలకు పెంచినట్లు చెప్పారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక కేటీఆర్, హరీష్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లాలని చూస్తున్నారని మండిపడ్డారు. మొన్నటి రోజున కేటీఆర్, న్నిటి రోజున హరీష్‌రావు 'కాంగ్రెస్ వచ్చింది కరువు వచ్చింది' అని మాట్లాడడం చూస్తే అసలు వారికి బుద్ధి ఉండే మాట్లాడుతున్నారా? అని మండిపడ్డారు. ప్రజల ఆశీర్వదంతో కాంగ్రెస్ ప్రభుత్వం చలికాలంలో ఏర్పడిందని, వేసవి అయిపోయి వర్షకాలంలో వర్షాలు పడకుంటే కరువు వచ్చిందంటే ఒక అర్థం ఉంటుందన్నారు. వారు అధికారం కోల్పోయి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డలో 7 టీఎంసీల నీటిని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే వదిలిపెట్టారని, ఎన్నికల కంటే ముందు మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని అన్నారు. రిపోర్టు రాగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం లోటుపాట్లు ఎక్కడ బయటపడతాయని భయపడి మేడిగడ్డలోని నీటిని సముద్రంలోకి వదిలేసిందన్నారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అపర భగీరథడని, ఇంజనీర్ అని గొప్పలు చెప్పి లక్ష కోట్ల ప్రజాధానాన్ని దుర్వినియోగం చేశారన్నారు. అన్నారం బ్యారేజీలో నీటిని వాడుకుందామంటే బ్యారేజీలో పిల్లర్లలో నుంచి నీరు లీక్ అవడంతో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ వారు డ్యామ్‌లో నీరు నిల్వ ఉంటే అన్నారం బ్యారేజీ కూడా కుంగిపోతుందని చెప్పడంతో బాధతో నీటిని విడుదల చేశామన్నారు. దీనంతటికి కారణం గత ప్రభుత్వ నిర్వాకమేనని మండిపడ్డారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నీరు అందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కేటీఆర్, హరీష్ రావు మాటలు చూస్తుంటే వర్షాకాలంలోనూ వర్షాలు పడకుండా ఉండాలని కోరుకుంటున్నట్లు అర్థమవుతుం దన్నారు. తహసీల్దార్ మహేష్‌కుమార్, జడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీటీసీ బాస రాజశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, నాయకులు ఎర్రం రాజు, చింతపల్లి శ్రీనివాస్‌రావు, కొండపల్లి వెంకటరమణరావు, సత్తయ్య, గాలిపెల్లి స్వామి, ఎర్రం ఆగయ్య ప్రభాకర్‌రెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో నేత కార్మికుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం మార్చి 12 : సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన తడక శ్రీనివాస్ (42)అనే పవర్ లూమ్ కార్మికుడు ఆర్థిక ఇబ్బందులతో సోమవారం అర్థరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాస్‌కు భార్య లావణ్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య లావణ్య బీడీలు చుడుతూ ఉపాధి పొందుతోంది. కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో ఏర్పడిన మనస్పర్థల కారణంగా కూతుళ్లతో లావణ్య తల్లిగారి ఇంటి వద్దనే ఉంటోంది. శ్రీనివాస్ తన తల్లి లచ్చవ్వతో కలిసి ఉంటున్నాడు. ఈ పరిస్థితుల్లో ఒంటరిగా ఉంటున్న శ్రీనివాస్ మానసికంగా కుంగి పోయాడు. కొద్ది రోజులుగా సరైన ఉపాధి దొరకక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. పనులు లేకపోవడంతోపాటు ఫిట్స్‌తో బాధపడుతున్న శ్రీనివాస్‌కు కనీసం మందులు కొనుగోలు చేసుకునే పరిస్థితి కూడా లేదని తోటి కార్మికులు తెలిపారు. ఈ పరిస్థితుల్లోనే శ్రీనివాస్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. శ్రీనివాస్ సోదరుడు జనార్దన్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

మండల అభివృద్ధికి కృషి

ముస్తాబాద్, మార్చి 12 : ముస్తాబాద్ మండల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జడ్పీటీసీ గుండం నర్సయ్య అన్నారు. మండలంలోని సేవాలాల్‌తండాలో రూ.20 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంగళవారం భూమి పూజ చేశారు. మాజీ సర్పంచుల ఫోరం కన్వీనర్ కలకొండ కిషన్‌రావు, శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, మున్యానాయక్, మున్నా, అంజనేయులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టిన సందర్భంగా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, జడ్పీటీసీ గుండం నర్సయ్య మాజీ సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ కలకొండ కిషన్‌రావు, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ గజ్జెల రాజు, వేముల సత్యనారాయణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 12 : ప్రభుత్వ వెనకబడిన తరగుతుల వసతి గృహాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వెనకబడిన తరగుతుల వసతి గృహాలను బీఆర్ఎస్వీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలనువిడదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్వీ నాయకులు మట్టె శ్రీనివాస్, వసతి గృహాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 12 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని సమస్యలను పరిష్కరించాలని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాపాలు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా సిరిసిల్ల బీవైనగర్‌కు చెందిన తడక శ్రీనివాస్ అనే నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే పరిశ్రమ యజమానులు, ఆసాములు, కార్మికులతో చర్చలు జరపాలన్నారు. బతుకమ్మ చీరల బకాయిలును వెంటనే చెల్లించాలన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను యథావిధిగా ఇవ్వాలన్నారు. నెల రోజులుగా నేత కార్మికులు ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు కార్మికులపై ప్రేమ ఉంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలసి ఇక్కడి సమస్యలను తెలియజేసే ప్రయత్నం చేయాలన్నారు. లేని పక్షంలో కార్మిక వర్గానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యకు పాల్పడిన కార్మికుడు శ్రీనివాస్ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకుడు సోమ నాగరాజు పాల్గొన్నారు.

యాదాద్రి ఆలయ ఈవోపై చర్యలు తీసుకోవాలి

గంభీరావుపేట, మార్చి 12 : యాదాద్రి ఆలయంలో దళిత డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు జరిగిన అవమానం నేపథ్యంలో ఆలయ ఈవోపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలో మంగళవారం మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. టెంపుల్ ఈవోపై చర్యలు తీసుకోవడంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి దోసల ఉపేంద్ర, కార్యదర్శి ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

దమ్మన్నపేట పాఠశాలలో వీడ్కోలు సమావేశం

గంభీరావుపేట, మార్చి 12 : గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మంళవారం వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యాక్రమాలు అలరించాయి. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి అధిక నిధులు తీసుకురావాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 12: గతంలో గ్రామాల అభివృద్ధి పనులకు బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన నిధులే కాకుండా కాంగ్రెస్ నేతలు అధిక నిధులు తీసుకురావాలని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జడ్పీటీసీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధిలో రాజీ లేకుండా ప్రగతి పనులను కొనసాగించాలన్నారు. గతంలోనే బీఆర్ఎస్ సర్కారు కిషన్‌దాస్‌పేట, నారాయణపూర్, బండలింగంపల్లి గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణానికి ఒక్కో దానికి రూ.20 లక్షలు, మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్ రూ.కోటి కేటాయించారని గుర్తు చేశారు. ఆ నిధులను వారే మంజూరు చేయించామని పేర్కొనడం సరి కాదన్నారు. గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి ప్రజల సమస్యల పరిష్కారానికి పాటు పడాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ రేణుక, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు పాల్గొన్నారు.

దుబ్బ రాజన్న హుండీ ఆదాయం రూ.29.90 లక్షలు

సారంగాపూర్, మార్చి 12: మండలంలోని పెంబట్ల కోనాపూర్ దుబ్బ రాజన్న జాతర సందర్భంగా ఆలయ హుండీని మంగళవారం ఆలయ అధికారులు లెక్కించారు. హుండీ ద్వారా రూ, 29,90,765 లక్షల ఆదాయం సమకూరింది. వివిద సేవా టికెట్ల ద్వారా రూ 25,557,804 వచ్చాంది. మిశ్రమ బంగారం 17 గ్రాములు, మిశ్రమ వెండీ ఐదు కిలోల 250 గ్రాములు కోడెల ద్వారా ఆదాయం 1,26,000 రూపాయలు వచ్చినట్లు ఆదాయ అధికారులు తెలిపారు. దేవాదాయ శాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈవో అనూష పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

గంభీరావుపేట, మార్చి 12: గంభీరావుపేట మండలం లింగన్నపేటలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్నట్లు ఎస్సై రాంమోహన్ తెలిపారు. రూ.14 వేల 60 నగదు,7 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

సమన్వయంతో గ్రామాల అభివృద్ధి


భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 12: అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, కిష్టంపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ పల్లెల ప్రగతికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, సమస్యల పరిష్కారానికిపాటు పడుదామని అన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఓ వైపు అభివృద్ధి మరో వైపు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు అనసూయ, శ్రీనివాస్ రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు జబ్బార్, గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సత్తయ్య, నాయకులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం కేంద్రంలో ఎస్డీఎఫ్ నిధుల ద్వారా అంబేద్కర్ నగర్ ప్రభుత్వ పాఠశాలల్లో పలు అభివృద్ధి పనులకు మంగళవారం ప్రజాప్రతినిధులు, నాయకులు భూమి పూజ చేశారు. ఎంపీపీ మాలోతు భూల, వైస్ ఎంపీపీ ఈసంపల్లి హేమ, సెస్ డైరెక్టర్ మల్లేశం, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, ఎంపీటీసీ అరుణ్ కుమార్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఉస్మాన్, ఎంపీవో నరేష్ కుమార్, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు బొంగు తిరుపతి, మాజీ సర్పంచులు దినకర్, కరుణ, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు మంజుల పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత


సర్టిఫికెట్లు అందజేస్తున్న మృత్యుంజయం

గంభీరావుపేట, మార్చి 12 : గంభీరావుపేట మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్‌ట్రక్షన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ కేంద్రం మొదటి బ్యాచ్‌కు సర్టిఫికెట్లను మంగళవారం అందజేశారు. మాజీ శాసన సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం, మాజీ సర్పంచ్ అక్కపల్లి బాలయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేత కార్మికులకు ప్రభుత్వం అండ

సిరిసిల్ల టౌన్, మార్చి 12: కార్మికులను ప్రభుత్వం ఆదుకుంటుందని, అధైర్య పడవద్దని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. ఆత్మహత్య చేసుకున్న పవర్‌లూం కార్మికుడు తడక శ్రీనివాస్ కుటుంబాన్ని మంగళవారం స్థానిక ప్రభుత్వా స్పత్రి వద్ద పరామర్శించారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజ కవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహా యం అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుం టుందన్నారు. టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఉపాధ్యక్షుడు అడ్డగట్ల శంకర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, నాయకులు స్వర్గం రాజు, పల్లె బాలరాజు ఉన్నారు.

● సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి, జిల్లా నాయకుడు సోమ నాగరాజు, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడ మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, వార్పిన్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, గౌరవ అధ్యక్షుడు ఉడుత రవి, పాలిస్టర్ ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వెల్దండి దేవదాస్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బొల్లి రామ్మోహన్ తడక శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మున్నూరు కాపులు ఆర్థికంగా ఎదగాలి

కోనరావుపేట, మార్చి 12 : మున్నూరు కాపులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు కచ్చకాయల బాల్ రెడ్డి అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో మున్నూరు కాపు నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘ భవనం ఏర్పాటుకు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. భవనం ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ సమావేశంలో ఉప్పుల గంగయ్య, దండు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి


ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

సిరిసిల్ల రూరల్, మార్చి 12: ఉపాధి లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న మరమగ్గాల కార్మికుడు తడక శ్రీనివాస్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మరమగ్గాల కార్మికుడు శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకోవడంతో స్పందించిన సీఐటీయూ, సీపీఎం, ఏఐటీయూసీ, ఆసాముల సమన్వయ కమిటీల ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిరిసిల్లలో మూడు నెలల నుంచి వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. పరిశ్రమలు మూతపడడంతో మరమగ్గాల కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై అనేక ఆందోళనలు, పోరాటాలు చేసినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పనిలేక ఆర్థిక ఇబ్బందులతో మరమగ్గాల కార్మికుడు తడక శ్రీనివాస్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకు న్నాడని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని అన్నారు. సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణ, ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు రవీందర్, అశోక్, రాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శిరాములు, ఐద్వా జిల్లా కార్యదర్శి జివ్వాజి విమల, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ పాత్ర కీలకం


భూమిపూజ చేస్తున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ టౌన్, మార్చి 12: రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధిలో మోదీ ప్రభుత్వానిది కీలకపాత్రని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. వేములవాడ మండలం సంకెపల్లిలో మంగళవారం రూ. 14 లక్షల ఎంపీ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక ఎంపీటీసీ బుర్ర లహరికశేఖర్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామపంచాయతీకి వచ్చే నిధుల్లో చాలా వరకు బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన వేనన్నారు. బీజేపీ మరో మారు అధికా రంలోకి వస్తుందని, గ్రామాలు మరింత అభివృద్ధి పథంలో దూసుకెళ్తాయని అన్నారు. అనంతరం ఎంపీటీసీ మాటాడుతూ ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వర్‌రావు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జింక అనిల్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెకార్ల లక్ష్మణ్ నాయకులు జింక శ్రీనివాస్, నాగుల రాము, నాగుల సురేష్, సిలువేని ప్రశాంత్, పూర్ణచందు, జింక శేఖర్, దశగౌడ్, ఎల్లయ్య చందు తదితరులు ఉన్నారు.

మహిళలపై దాడులను పట్టించుకోని ప్రధాని


సిరిసిల్లలో ఐద్వా ఆవిర్భావ వేడుకలు

సిరిసిల్ల రూరల్, మార్చి 12: దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పట్టించుకోవడం లేదని ఐద్వా జిల్లా కార్యదర్శి జివ్వాజి విమల అన్నారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీపీఎం కార్యాలయం ఎదుట మంగళవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా జిల్లా కమిటీ(ఐద్వా) ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఎగురు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 1981లో చెన్నైలో భారత ప్రజాతంత్ర మహిళా సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. అనాటి నుంచి మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై అనేక పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. మహిళలు ఇప్పటికైనా రాజకీయంగా ఎదగడానికి ముందుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ, సంధ్య, యశోద, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురి రిమాండ్

తంగళ్లపల్లి, మార్చి 16: కోర్టుకు గైర్హాజరవుతున్న ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని టెక్స్‌టైల్ పార్కుకు చెందిన పల్లవి, రాజేశ్వరి, సిరిసిల్లకు చెందిన కాసర్ల సాయికుమార్, ఇల్లంతకుంట మండలం రహీంఖాన్ పేట గ్రామానికి చెందిన గుడిసె దేవయ్యను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలం చింతలఠాణా గ్రామానికి చెందిన మెడ కొక్కుల రోహిత్‌ను మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కోర్టుకు వాయిదా ప్రకారం హాజరు కావాలని సూచించారు.

ఆసాములు, కార్మికులకు ఉపాధి కల్పించాలి


నివాళి అర్పిస్తున్న ఆసాములు

సిరిసిల్ల రూరల్, మార్చి 12: ఆత్మహత్యలు పెరగకముందే మరమగ్గాల కార్మి కులు, ఆసాములకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పించాలని, వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని నివారించాలని ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో భద్రావతి సంఘం ఆవరణలో ఆసాములు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి ఎనిమిదో రోజుకు చేరకున్నాయి. సిరిసిల్లలో ఆత్మహత్య చేసుకున్న మరమగ్గాల కార్మికుడు తడక శ్రీనివాస్‌కు దీక్ష శిబిరంలో నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ సంక్షోభంతో మూడు నెలల నుంచి పరిశ్రమలు మూత పడ్డాయని, ఉపాధి లేక ఆర్థికంగా పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ చీరలతోపాటు ప్రభుత్వ ఆర్డర్‌లను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసాములు చేరాల అశోక్, మండల రాజు, పరందాములు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్థులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 12: కాంగ్రెస్ ఆరుగ్యారెంటీలు దశలవారీగా అమలుపై హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్లను సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలంలో ప్రారంభించారన్నారు. ఇళ్లు లేని నిరుపేదల సొంతింటి కల నెరవేరనుందన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, గిరిధర్‌రెడ్డి, బాబు, బుచ్చాగౌడ్, రాజేశం, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామంలో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. గృహజ్యోతి ప్రారంభించిన సందర్భంగా వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, కాంగ్రెస్ నాయకులు బాదనేని బాలరాజు, శేఖర్, అవురం సురేష్, మొగిలి పాల బాబు, మల్లయ్య, మల్లయ్య, మారుపాక మల్లయ్య, రెడ్డి, కొమిరెడ్డి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కదనభేరీకి తరలిన బీఆర్ఎస్ శ్రేణులు


కరీంనగర్‌లో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో సిరిసిల్ల నాయకులు

సిరిసిల్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్‌లో మంగళవారం నిర్వహించిన కదనభేరీ మహాసభకు జిల్లా వ్యాప్తంగా 25 వేల మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. బీఆర్ఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాలో మండలాల నుంచి జనసమీకరణకు బస్సులు, ఇతర వాహనాలను సమకూర్చారు.

సిరిసిల్ల టౌన్: సిరిసిల్ల పట్టణం నుంచి బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కదనభేరీ మహాసభకు తరలి వెళ్లారు. విద్యానగర్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి వాహనాలను ప్రారంభించారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, జిల్లా నాయకులు బొల్లి రామ్మోహన్, గొట్టె అంజయ్య, సిరిగిరి మురళి, గోషిక శ్రీనివాస్, అన్నల్‌దాస్ వేణు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు తరలివెళ్లారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలో నాయకులు ర్యాలీ నిర్వహించి బీఆర్ఎస్‌కు అనుకూలంగా నినదాలు చేశారు. జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య యాదవ్, పర్శరాం, వనజఅనీల్, అశ్విన్‌శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలంలోని గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లాయి. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: బీఆర్ఎస్ మండల నాయకులు మంగళవారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, ఎంపీపీ మాలోతు భూల, జడ్పీటీసీ గుగులోతు కళావతి, సెస్ డైరెక్టర్ మల్లేశం, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, వైస్ ఎంపీపీ హేమ పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

వేములవాడ టౌన్: వేములవాడ అర్బన్ మండలం, పట్టణంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. జడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రవ్వబాబు, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు నాయకులు ఆర్సీరావు, భూమల్ల లక్ష్మణ్, ఇటిక్యాల రాజు, గుండెకార్ల నరేష్, సిలివేని మల్లేశం, మారవేని మల్లేశం తదితరులు ఉన్నారు.

చందుర్తి: చందుర్తిలో బీఆర్ఎస్ అధ్యక్షుడుమ్యాకల ఎల్లయ్య జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎంపీపీ బైరగోని లావణ్య, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అబ్రహం, నాయకులు తదితరులు ఉన్నారు.



సిరిసిల్ల నుంచి సభకు తరలివెళ్తున్న నాయకులు